ప్రజాశక్తి

ఆదివారం 15 జనవరి 2023 | 5 | అనంతపురం

జూదాలపై పోలీసుల నిఘా

ప్రజాశక్తి-అనంతపురం

సంక్రాంతి పండుగ సందర్భంగా జూదాలను నియంత్రించేందుకు ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి ఆదేశాల మేరకు జిల్లా పోలీసులు చర్యలు చేపట్టారు. భోగి, సంక్రాంతి, కనుమ రోజుల్లో జూదాలు నిర్వహించకుండా ఆయా గ్రామాల్లో ముమ్మర తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కోడి పందేలు, పేకాట, ఇతర జూదాల జోలికెళ్లొద్దని గ్రామాల్లో దండోరాలు వేయించారు. కోడిపందేల కేసుల్లో ఉన్న పాత నిందితులను పందేల వైపు వెళ్లొద్దని హెచ్చరిస్తున్నారు. గ్రామాల్లో ప్రశాంతంగా పండుగను నిర్వహించుకోవాలని గ్రామస్తులకు సూచిస్తున్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు తావులేకుండా ముఖ్య పట్టణాల్లోని లాడ్జీలను తనిఖీ చేసి, కొత్త వ్యక్తులు ఎవరైనా ఉంటే వారి వివరాలు క్షుణ్ణంగా తెలుసుకున్నారు.

వీడని ప్లాస్టిక్..!

ప్లాస్టిక్ వినియోగం ఆరోగ్యానికి ప్రమాదకరమని, వాతావరణంపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిసినా దాని వినియోగం మాత్రం తగ్గడం లేదు. 50 మైక్రాన్స్ కన్నా తక్కువ ఉన్న ప్లాస్టిక్ వినియోగాన్ని ప్రభుత్వం పూర్తిగా నిషేధించింది. దీనిని పక్కాగా అమలు చేయాల్సిన అధికార యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగా పట్టణ వీధులు, మురుగకాలువలు ప్లాస్టిక్ కూపాలుగా మారుతున్నాయి. రోగాలు పెంచుతున్నాయి. ప్లాస్టిక్‌ను భూమిలో వేస్తే నేల కలుషితమవుతోంది. కాలిస్తే విషవాయువులు వాతావరణంలో కలిసి పర్యావరణం దెబ్బతింటోంది. జీవ మనుగడపై దుష్ప్రభావం కలిగించే ప్లాస్టిక్ నిషేధంలో నగర, పురపాలక సంస్థలు వైఫల్యం

- విచ్చలవిడిగా వినియోగం
- ప్రమాదంలో ప్రజారోగ్యం..!
- పర్యావరణంపై తీవ్ర ప్రభావం
- నిషేధం అమల్లో ఉన్నా, చోద్యం చూస్తున్న యంత్రాంగం

ప్రజాశక్తి-హిందూపురం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో అనంతపురం కార్పొరేషన్‌తో పాటు హిందూపురం, పుట్టపర్తి, ధర్మవరం, మడకశిర, పెనుకొండ, రాయదుర్గం, తాడిపత్రి, గుంతకల్లు, గుత్తి, కళ్యాణదుర్గం, మున్సిపాలిటీలలో ప్లాస్టిక్ నిషేధం అమలులో ఉంది. ఈ పట్టణాల్లో దాదాపు 10.45 లక్షల జనాభా ఉంది. రోజూ 422 టన్నుల చెత్త సేకరిస్తున్నారు. ఈ చెత్తలో సుమారుగా 68 టన్నులు ప్లాస్టిక్ వ్యర్థాలు ఉన్నాయని అధికారులే తెలిపారు. అంటే నెలకు 1,845 టన్నులు, ఏడాదికి సరాసరి 22 వేల టన్నులకు పైగా ప్లాస్టిక్ వినియోగిస్తున్నట్లు స్పష్టమవుతోంది. గ్రామాల్లో వినియోగం సరేసరి. సుప్రీంకోర్టు తీర్పుమేరకు 50 మైక్రాన్ల కంటే తక్కువ ఉన్న ప్లాస్టిక్ వినియోగిస్తే పురపాలక శాఖ అధికారులు దాడులు చేసి జరినామా వేయవచ్చు. రూ.500 నుంచి రూ.5 వేలకుపైగా అపరాధ రుసుం విధించవచ్చని అధికారులే చెబుతున్నారు. అయినా దాడులు నామమాత్రంగానే జరుగుతున్నాయి.

ఇటీవల హిందూపురంలోని ఓ ట్రాన్స్‌పోర్టులో అధికారులు స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్‌కవర్ల సంచులు

సచివాలయ వ్యవస్థ ఉన్నా నిర్లక్ష్యమే

ఉమ్మడి అనంతపురం జిల్లాలో అన్ని పురపాలక సంఘాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో అన్ని సచివాయాల్లో పర్యావరణానికి ప్రత్యేక కార్యదర్శిని ప్రభుత్వం నియమించినప్పటికీ ప్లాస్టిక్ నిషేధం పూర్తి స్థాయిలో అమలు కావాడం లేదు. అక్కడక్కడ పురపాలక సంఘాల్లో సచివాలయ పర్యావరణ కార్యదర్శులు బృందంగా ఏర్పడి దాడులు నిర్వహించి, ప్లాస్టిక్‌ను పట్టుకున్నప్పటికీ వారికి విధించే జరిమానాలు తక్కువ ఉండడంతో వ్యాపారులు ప్లాస్టిక్ నిషేధాన్ని పాటించడం లేదు. నిషేధాన్ని కఠినంగా అమలు చేయడంలో పర్యావరణ కార్యదర్శులు నిర్లక్ష్యం విడిచి దాడులు నిర్వహిస్తే తప్పా పూర్తి స్థాయిలో ప్లాస్టిక్ నిషేధం అమలు కాని పరిస్థితి కన్పిస్తోంది.

ఎక్కడపడితే అక్కడ ప్లాసిక్...

ప్లాస్టిక్ వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడ పారేస్తున్నారు. మురుగు కాల్వల్లో వేయడం వల్ల కాలువలకు అడ్డంపడి మురుగు రోడ్లపైకి చేరుతోంది. కల్వర్టులకు అడ్డంగా చేరి వర్షం వస్తే రోడ్లు చెరువుల్లా మారుతున్నాయి. దుకాణదారులు డ్రెయినేజీలపై బండలు వేయడంతో వాటి కింద ప్లాస్టిక్ ఇరుక్కుపోయి పారిశుధ్య సమస్యలు తలెత్తుతున్నాయి. 50 మైక్రాన్ల లోపు ప్లాస్టిక్ వినియోగం నిషేధం ఉన్నా.. అమలు చేయడంలో పురపాలక యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే ఆరోపణలున్నాయి. ప్లాస్టిక్ వాడకం వల్ల భూతాపం పెరుగుతుందని పలు అధ్యయనాలు నిగ్గుతేల్చాయి. ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల్లోని ఆహార పదార్థాలు తినడం వల్ల ప్రమాదకరమైన 'కార్సినోజన్లు' శరీరంలో చేరి క్యాన్సర్‌కు దారితీస్తుందని వైద్యులు చెబుతున్నారు. ఇంతటి నష్టాన్ని చేకూర్చే ప్లాస్టిక్ వినియోగించకుండా ఉండేలా ప్రజల్లో అధికారులు చైతన్యం తీసుకురావాల్సి ఉందని పలువురు సూచిస్తున్నారు.

విస్తృత దాడులు చేస్తాం

50 మైక్రాన్లకన్నా తక్కువ ఉన్న ప్లాస్టిక్ వినియోగాన్ని ప్రభుత్వం నిషేధించింది. ఎక్కడైనా వినియోగిస్తే విస్తత దాడులు చేసి చట్టపరమైన చర్యలతో పాటు భారీ జరిమానా విధిస్తాం. కరోనా వల్ల కొంత దాడులు తగ్గినమాట వాస్తవమే. త్వరలో ప్లాస్టిక్ నిషేధం అమలుపై ప్రత్యేక ప్రణాళికను అమలు చేస్తాం.

డాక్టర్ వెంకటేశ్వరరావు,
మున్సిపల్ కమిషనర్, హిందూపురం

పండుగ వేళ రాజకీయ సందడి..!

- కనుమపైనే మక్కువ
- పెద్దఎత్తున జాతరలకు సిద్ధం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ధాన్యం ఇంటికి చేరిన వేళ జరుపుకునే సంక్రాంతి పండుగలో రాజకీయ సందడే ఎక్కువగా కన్పిస్తోంది. ఎన్నికలు సమీపిస్తుండటంతో గ్రామీణ పండుగ అయిన సంక్రాంతి సమయంలో నేతలు గ్రామాల్లో సందడికి సిద్ధమయ్యారు. కొన్ని గ్రామాల్లో ఇప్పటికే పెద్ద ఎత్తున గ్రామీణ క్రీడలను నిర్వహిస్తున్నారు. ఇక కనుమ రోజున ఆయా ప్రాంతాల్లో ప్రజలతో కలసి పండుగ జరుపుకునేందుకు నాయకులు సిద్ధమ్యారు. కోస్తా ప్రాంతంలో లాగా ఇక్కడ కోడి పందేళ్లు అడటం తక్కువగానే ఉంటాయి. ఉన్నా అరకొరగా ఇళ్ల మధ్యలోనే వీటిని ఆడుతుంటారు. కనుమ పండుగ రోజు మాత్రం యాటలు (మేక, పొట్టేలు) కొట్టి పండుగ జరుపుకోవడం ఆనవాయితీగా ఉంది. శనివారం భోగి పండుగ రోజే స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉష చరణ్ శ్రీ బోగి మంటలు నిర్వహించడమే కాకుండా నియోజకవర్గం పరిధిలోని కళ్యాణదుర్గం మండలం మల్లిపల్లి గ్రామం పరిధిలో పర్యటించారు. ఎద్దుల బండిపై వెళ్లి చౌడేశ్వరి దేవాయలంలో పూజలు నిర్వహించారు. నవరత్నాలతో సామాన్య జీవితాల్లో సంక్రాంతి తెచ్చామని చెప్పారు. అనంతపురం నియోజకవర్గం పరిధిలోని నారాయణపురంలో గ్రామీణ క్రీడలను స్థానిక వైసిపి నాయకులు నిర్వహించగా ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, నగర మేయరు వసీం ఇందులో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం మండలం మల్లిపల్లి గ్రామంలో శనివారం జరిగిన జాతరకు ఎద్దుల బండిపై వస్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్

కనుమ రోజు జాతరలు

సంక్రాంతి పండుగ అయిపోయిన మరుసటి రోజు సోమ, మంగళవారాల్లో పెద్దఎత్తున కనుమ పండుగ జరుపుకునేందుకు నేతలు ఏర్పాట్లు చేసుకోవడం గమనార్హం. రాప్తాడు నియోజకవర్గం పరిధిలో తోపుదుర్తి కనగానపల్లి మండలంలో మద్దెలచెరువు, తాడిపత్రి ప్రాంతంలో సింగనగుట్టపల్లి ఇలా అనేక ఊళ్లలో కనుమ పండుగను పెద్దఎత్తున నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. వందల యాటలను కొట్టేందుకు ఏర్పాట్లు జరగడమేకాకుండా దీనికి అందరినీ కలిపేందుకుగానూ ఆహ్వానాలను ఇప్పటికే పంపారు. కనేకల్ మండలంలోనూ జాతర విషయంలో దున్నపోతు కోసం రెండు గ్రామాల మధ్య వివాదం సైతం నడుస్తోంది.

సామాన్యుల్లో కనిపించని ఉత్సాహం

రాజకీయంగా పండుగ సందడి కనిపిస్తున్నా... సామాన్యుల ఇళ్లలో అటువంటి హడావుడి సందడి కనిపించలేదనే చెప్పాలి. గత ఖరీఫ్‌లో మంచి వర్షాలు పడినప్పటికీ పంటల దిగుబడులు ఆశించినంత రైతులకు దక్కలేదు. దీంతో డబ్బుల్లేక పెరిగిన నిత్యావసర ధరల నేపథ్యంలో మొక్కుబడిగానే పండుగ జరుపుకుంటున్నారు. పట్టణ ప్రాంతాల్లోనూ ఆ సందడి కనిపించడం లేదు. పెరిగిన ఆర్థిక సంక్షోభం ప్రభావంతో ఆదాయాలు తగ్గిపోయాయి. ఆదాయాలు పడిపోయాయి. దీంతో కొత్త బట్టలు, నిత్యావసరాలు కొనేవారు లేక దుకాణాలు వెలవెలబోతున్నాయని వ్యాపారాలు వాపోతున్నారు.

నేడు తాడిపత్రిలో ఎడ్లబండ్ల ప్రదర్శన

ప్రజాశక్తి-తాడిపత్రి.

ప్రాచీన సాంఘిక, సాంస్కృతిక కళారంగాలలో ఒక భాగమైన ఎడ్లబండ్ల ప్రదర్శన తిలకించి రైతులకు ఎద్దుల బండ్ల యజమానులకు ఉత్సాహాన్ని నింపాలని ఏపీ రైతు సంఘం నాయకులు రాజారామిరెడ్డి కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా ఎడ్లబండ్ల ప్రదర్శనను తాడిపత్రి పట్టణంలో ఎపి రైతు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహిస్తామని చెప్పారు. ఉదయం 9 గంటలకు సిబి రోడ్డు, మెయిన్ రోడ్డు మీదుగా ఈ ప్రదర్శన ఉంటుందన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ప్రదర్శనను తిలకించి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

రేణుమాకులపల్లిలో రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉరవకొండ మండలం రేణిమాకులపల్లి గ్రామ సర్పంచి బోయ రామాంజనేయులు ఆధ్వర్యంలో గుంతలుపడిన రోడ్లకు శనివారం మరమ్మతులు చేపట్టారు. ఉరవకొండ నుంచి కనేకల్‌కు వెళ్లే రహదారి గుంతల పడి శిథిలావస్థకు చేరుకోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. రోడ్లకు మరమ్మతులు చేయాలని సంబంధిత ఆర్‌అండ్‌బి శాఖ అధికారులపై సర్పంచి ఒత్తిడి తీసువచ్చారు. వారు స్పందించి గుంతలు పడిన రోడ్డుకు మరమతులు చేపట్టారు. సర్పంచి దగ్గరుండి పనులు చేయించారు.

పెండింగ్ డిఎలను చెల్లించాలి

గుత్తి : పెన్షనర్లకు బకాయి పడ్డ డిఎలను తక్షణమే ప్రభుత్వం చెల్లించాలని ఏపీ రాష్ట్ర పెన్షనర్ల సంఘం మండల అధ్యక్షులు కె.అబూబకర్, అదనపు కార్యదర్శి జె.కుళ్లాయి బాబు డిమాండ్ చేశారు. స్థానిక పట్టణంలోని క్రీడా మైదానం వద్ద ఉన్న ఏపీ రాష్ట్ర పెన్షనర్ల సంఘం కార్యాలయంలో శనివారం పెన్షనర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 80 శాతం మంది పెన్షనర్లు పెన్షన్‌పై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారని చెప్పారు. కొన్ని నెలలుగా పెన్షనర్ల సొమ్ము ఇవ్వడంలో ప్రభుత్వం ఆలస్యం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతినెలా 1వ తేదీనే పెన్షన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెన్షన్ దారులకు ఆదాయపు పన్ను నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర పెన్షనర్ల సంఘం మండల కార్యదర్శి రామ్మోహన్, కోశాధికారి ఫక్రుద్దీన్, సంయుక్త కార్యదర్శి లక్ష్మీనారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అధ్యక్షులు అబూబకర్

రైల్వే అండర్ బ్రిడ్జిల వద్ద తొలగని ఇబ్బందులు

రోడ్డు అండర్ బ్రిడ్జి కింద నిలిచిన నీరు

ప్రజాశక్తి-రాయదుర్గం

రోడ్డు మార్గంపై వెళ్లేటప్పుడు రైలు మార్గం వచ్చి గేట్ల వద్ద వేచి ఉండే సమస్య పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన రైలు అండర్ బ్రిడ్జిలు ప్రయాణికులకు సమస్యలను తెచ్చిపెడుతున్నాయి. రహదారి వద్ద రైలు మార్గం వచ్చినప్పుడు తక్కువ ఖర్చుతో సమస్య పరిష్కరించబడుతుందని అనేకచోట్ల రైలు అండర్ బ్రిడ్జిలు నిర్మిస్తున్నారు. అయితే ఈ బ్రిడ్జిల వద్ద చేరే వర్షపు నీరు ముందుకు వెళ్లేందుకు తగిన పరిష్కారం లేకపోవడంతో ఈ వంతెనల వద్ద అడుగుల కొద్దీ ఎత్తున నీరు నిలబడి ప్రయాణికులు ఈ మార్గంలో ముందుకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. రాయదుర్గం పట్టణ పరిధిలో బైపాస్ రోడ్డు వద్ద, ముత్రాస్ కాలనీ వద్ద రెండు అండర్ బ్రిడ్జిలు, అడగుప్ప రోడ్డు సమీపంలో మరో రెండు బ్రిడ్జిలు ఉన్నాయి. కొంతకాలం క్రితం కురిసిన వర్షాలకు ఈ అండర్ బ్రిడ్జిల వద్ద పెద్ద ఎత్తున నీరు నిల్వవుంది. నాయినిచెరువు నిండడంతో మరువపారి నీరు బీటీపీ రోడ్డు అడుగుప్ప రోడ్డు వద్దకు చేరాయి. జాతీయ రహదారి వద్ద సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేసినప్పటికీ రాయదుర్గం పట్టణం, కొండపై కురిసిన వర్షానికి వర్షపు నీరు ముందుకు వెళ్లేందుకు తగిన వంతెన జాతీయ రహదారి వద్ద ఏర్పాటు చేయకపోవడంతో ఐదు అడుగుల ఎత్తు వరకు సర్వీస్ రోడ్డుపై నీరు నిలిచింది. జాతీయ రహదారి రైలు వంతెన నిర్మాణం పూర్తి కాకపోవడంతో అనేక భారీ వాహనాలు పట్టణం గుండా వెళ్తున్నాయి. కొన్ని బైపాస్ రోడ్డు వద్ద వెళ్లి రైలు అండర్ బ్రిడ్జి వద్ద బురద నీటి మడుగులో చిక్కుకుంటున్నాయి. దీంతో ఆ వాహనాలను బయటకు రప్పించేందుకు క్రేన్లు, జెసిబిలు అవసరమవుతున్నాయి. అంతేకాకుండా లారీలలోని సరుకులు తడిచిపోతున్నాయి. లారీలను బయటకు తీసేందుకు రూ.వేలు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఈ సమస్యకు ఇటు రైల్వే శాఖ కానీ, అటు రోడ్లు భవనాల శాఖ కానీ శాశ్వత పరిష్కారం చూపడంలేదు. దీంతో ప్రయాణికులు, వాహనదారులు తమ గమ్యస్థానం చేరేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత శాఖల అధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు, ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

రైతుల పండుగ..సంక్రాంతి : ఎమ్మెల్యే అనంత

ప్రజాశక్తి -అనంతపురం

రైతులు పండించిన పంటలు చేతికొచ్చిన వేళ ఎంతో సంతోషంగా మూడు రోజులు జరుపుకునే పండుగ సంక్రాంతి అని, అందుకే సంక్రాంతి పండుగను రైతుల పండుగగా పరిగణిస్తారని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం అనంతపురం అర్బన్ పరిధిలోని నారాయణపురం పంచాయతీలో నిర్వహించిన 'మన ఊరు - మన సంక్రాంతి' కార్యక్రమంలో జెడ్పి ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైసిపి జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య లతో కలిసి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు. ముందుగా రాష్ట్ర స్థాయి రాతిదూలం లాగుడు పోటీలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. మన సంస్కృతి, సంప్రదాయాలు మరుగున పడుతున్న వేళ.. నగరానికి ఆమడదూరంలో ఉన్న నారాయణపురంలో మన ఊరు - మన సంక్రాంతి పేరుతో రాష్ట్ర స్థాయి రాతి దూలం లాగుడు పోటీలు, ముగ్గుల పోటీలను పెద్ద ఎత్తున నిర్వహిస్తూ సంస్కృతి, సంప్రదాయాలను గుర్తుచేస్తున్న వైసిపి నాయకులు ఉమ్మడి మదన్ మోహన్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేసిన నాటి నుండి రాష్ట్రంలో రైతు సంక్షేమం దిశగా ఎన్నో కార్యక్రమాలు చేపట్టారని చెప్పారు. దానితో పాటు ఆ దేవుడి చల్లని దీవెనలు వలన గత రెండు సంవత్సరాలుగా వర్షాలు సంవద్ధిగా పడుతున్నాయన్నారు. దేశంలోనే కరువు జిల్లాగా పేరు పొందిన అనంతపురం జిల్లాలో సైతం వర్షాలు బాగా కురిసి భూగర్భ జలాలు పెరిగాయని హర్షం వ్యక్తం చేశారు. ప్రజలు సంక్రాంతి పండుగను ఆయురారోగ్యాలతో సంతోషంగా జరుపుకోవాలని సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. జెడ్పి ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైసీపీ జిల్లా అధ్యక్షులు పైలా మాట్లాడుతూ మరుగున పడుతున్న మన సంప్రదాయాలను గుర్తు చేస్తూ మన ఊరు మన సంక్రాంతి సంబరాల్లో తనను కూడా భాగస్వామ్యులుగా చేసినందుకు సంతోషంగా ఉన్నదని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు అనంత చంద్రారెడ్డి, పలువురు వైసిపి ముఖ్య నాయకులు, స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రాతిదూలం లాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనంత

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డిఎస్‌ఇప నరసింగప్ప, డివైఎఫ్‌ఐ నాయకులు

మోడల్ పరీక్షలను సద్వినియోగం చేసుకోండి

డిఎస్‌పి యు.నరసింగప్ప

ప్రజాశక్తిగుంతకల్లు

పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులు పట్టణంలోని శ్రీసాయి మహిళా జూనియర్ కళాశాలలో ఈ నెల 18న డివైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిర్వహించనున్న పోలీసు కానిస్టేబుల్ మోడల్ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని డిఎస్‌పి యు.నర సింగప్ప పేర్కొన్నారు. శనివారం డివైఎఫ్‌ఐ నాయకులు డిఎస్‌సి చేతుల మీదుగా మోడల్ పరీక్షల ప్రచార గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ కానిస్టేబుల్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగ అభ్యర్థులకు ఈ మోడల్ పరీక్షలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ సందర్భంగా డివైఎఫ్‌ఐ చరణ్, మాజీ నాయకులు సాకే నాగరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు ద్వారా కానిస్టేబుల్ 6100, ఎస్‌ఐ 411 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. నాలుగు సంవత్సరాలుగా పోలీసు శాఖలో నోటిఫికేషన్ లేనందున వయోపరిమితి 5 సంవత్సరాలకు పెంచాలని డివైఎఫ్‌ఐ పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించిందన్నారు. ఆ పోరాటాల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం 2 సంవత్సరాలకు వయోపరిమితి పెంచిందని తెలిపారు. ఈనెల 22న ప్రిలిమ్స్ పరీక్షలు రాస్తున్న నిరుద్యోగులకు ఈ మోడల్ పరీక్ష ఎంతగానో ఉపయోగపడుతుందని ఉద్దేశంతో ప్రముఖ విద్యావేత్త ఎమ్మెల్సీ కెఎస్. లక్ష్మణరావు పరివేక్షణలో వారి బృందం ఆధ్వర్యంలో ప్రశ్నాపత్రం సిద్ధం అవుతోందన్నారు. ఇప్పటికే 5 లక్షల పైగా నిరుద్యోగులు పోలీస్ కానిస్టేబుల్ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఈ నేపథ్యంలో పరీక్షల పట్ల వారికి భయాందోళన లేకుండా, పరీక్ష పత్రం పట్ల అవగాహన కోసమే మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ మోడల్ పరీక్షలు డివైఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో అన్ని జిల్లాల్లో ఈనెల 18వ తేదీ మధ్యాహ్నం 2గం నుంచి 5 గంటల వరకూ నిర్వహిస్తామన్నారు. కావున దరఖా స్తుదారులు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు డివైఎఫ్‌ఐ నాయకులు చరణ్ 9014930369, వెంకీ 62819 63077, సురేంద్ర 8897729429 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్‌ఐ నాయకులు ప్రతాప్, సురేంద్ర, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు వెంకీ, చందు, కుమార్ పాల్గొన్నారు.

రథ నిర్మాణానికి రూ.77.93 లక్షల విరాళాలు

ప్రజాశక్తి-ఉరవకొండ

అనంతపురం జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలం లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం నూతన రథ నిర్మాణానికి ఇప్పటివరకు భక్తుల నుంచి రూ.77,93,540 లక్షలు అందింది. ఈ విషయాన్ని ఆలయ ఈవో కె.విజయ్ కుమార్ విలేకరులకు శనివారం తెలియజేశారు.

బోరుబావి నుంచి వృథాగాపోతున్న నీరు

వృథాగాపోతున్న తాగునీరు

పట్టించుకోని అధికారులు

పుట్లూరు : కడవకల్లు గ్రామంలోని బిసి కాలనీతో పాటు మరికొన్ని ప్రాంతాలకు తాగు నీరు అందించే బోరు బావి వద్ద నీరు వృథాగా పోతోంది. దీంతో తాగునీటి కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీరు వృథాగా పోతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి వృథాను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని స్థానిక సిపిఎం నాయకులు కోరుతున్నారు.

జాతరకు రూ.20 వేలు విరాళం

శింగనమల : తరిమెల గ్రామంలో మంగళవారం నిర్వహించనున్న నల్లలమ్మ జాతర కార్యక్రమానికి శింగనమల జెడ్‌పిటిసి కంచిరెడ్డి సుధారెడ్డి, కంచిరెడ్డి భాస్కర్ రూ.20 వేలు విరాళంగా అందజేశారు. ఇటీవల తరిమెల గ్రామంలో నూతనంగా నల్లలమ్మ దేవాలయాన్ని నిర్మించారు. మంగళవారం జాతర నిర్వహించనున్నారు. ఇందుకు తమ వంతు సాయంగా వారు విరాళాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బాల్‌రెడ్డి కృష్ణారెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

గోదాదేవి కల్యాణం

రాయదుర్గం : రాయదుర్గం పట్టణంలోని ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో గోదాదేవి వెంకటరమణస్వామి కల్యాణం శనివారం జరిగింది. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపై వెంకటరమణస్వామి, గోదాదేవి ఉత్సవమూర్తులను అలంకరించి పురోహితులు, అర్చకులు సంప్రదాయ పద్ధతిలో కల్యాణం జరిపించారు. ఈ కార్యక్రమానికి స్థానిక శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, భారతీ దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు గౌని పాలాక్షిరెడ్డి, దేవాలయ శాఖ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసులు, ఆలయ పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

లక్ష్మీ నారసింహుడి పల్లకీసేవ

ఉరవకొండ : ఉరవకొండ మండల పరిధిలో వెలసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలం శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామి వారి పల్లకీ సేవ ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారి ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలతో అలంకరించి పల్లకీలో మేళతాళాల మధ్య ఆలయం చుట్టూ ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో విజయ్‌కుమార్, ఆలయ అర్చకులు ద్వారకానాథ్ స్వామి, బాలాజీ స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్టాపన

బుక్కరాయసముద్రం : బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని అతి పురాతన దేవాలయాలలో ఒకటైన శ్రీ లక్ష్మీసమేత నారాయణస్వామి దేవాలయంలో శనివారం ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు ముత్యాల సత్యనారాయణ తెలిపారు. ధ్వజస్తంభ దాతలు చిట్రా పార్వతమ్మ, రాంబొజ్జి కుమారులు చిట్రా వాణి, లక్ష్మీనారాయణ, చిట్రా గౌతమి ప్రకాష్‌లు భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఎ.పార్వతి, ఎంపీపీ దాసరి సునీత, టిడిపి ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, పర్వతనేని శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి శుభాకాంక్షలు : ఎమ్మెల్సీ

ఉరవకొండ : ఉరవకొండ నియోజకవర్గం ప్రజలకు ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి, వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పండుగ అందరికీ శుభాలను చేకూర్చాలని, బంధువులు, మిత్రులు, ప్రజలు సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో సంతోషంగా గడపాలని, వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పరిపాలనలో బడుగు, బలహీన, పేద ప్రజలకు అనేక సంక్షేమ కార్యక్రమాల రూపంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలబెట్టడానికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఈ ఏడాదీ సంక్షేమ ఫలాలు అందరికీ చేరి అభివృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు.

గడపగడపకూ ప్రభుత్వ లబ్ధి

కుందుర్పి : వైసిపి ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరి గడపగడపకూ ప్రభుత్వ పథకాల లబ్ధిని అందజేస్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్ పేర్కొన్నారు. శనివారం నాడు కుందుర్పి మండల పరిధిలోని ఎన్.వెంకటంపల్లి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. మంత్రి ప్రతి ఇంటి వద్దకెళ్లి ప్రజలతో మాట్లాడారు. భోగి సందర్భంగా గ్రామస్తులు వారి ఇళ్ల ముందు వేసుకున్న ముగ్గులను పరిశీలించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తామని ఆమె తెలియజేశారు.

Global Agrigenetics

NOTICE

In order to make the indian farmers internationally competitive, Global Agrigenetics india Private Limited, brings to you the following 100% Water Soluble Mixture Fertilizers as per order dated 24.10.2015 issued by Ministry of Agriculture & Farmers welfare, Govt of india, New Delhi.

S.No.	Name of the Fertilizer	Total N(%)	Total P(%)	Total K(%)
1	18:46:00	18	46	00
2	00:52:34	00	52	34
3	12:61:00	12	61	00

Salient Features
1. 100% Water Soluble
2. Improves the quality and yield of the produce
3. Suitable to use through drip irrigation and foliar application

Packing: Available 100ml to 5lts.
Supply and sales of above grades will be done after 15 days

GLOBAL AGRIGENETICS INDIA PRIVATE LIMITED
(A Subsidiary of Nuziveedu Seeds Limited Regd office: D.No. 5-97-5, Subeej house, 6/12, Brodipet, GUNTUR-522 002, A.P India

సమయం లేదు మిత్రమా !

ప్రజాశక్తి -అనంతపురం ప్రతినిధి

సమయం లేదు మిత్రమా' అన్నట్లుగా ఉంది. అధికారపార్టీ నేతల తీరు. సార్వత్రిక ఎన్నికలకు మరో ఏడాది మాత్రమే సమయముంది. ఇప్పటికే మూడున్నరేళ్లు పూర్తయ్యాయి. ఈ ఏడాది ఆఖరు వచ్చిందంటే ఎన్నికలు సమీపిస్తాయి. అప్పుడు ఏదైనా తప్పు చేస్తే ఎన్నికలపై ప్రభావం పడుతుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఇప్పుడే సాధ్యమైనంత వెనకేసుకునే పనులను అధికారపార్టీ నేతలు చేపట్టారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అభివృద్ధి కార్యక్రమాల ద్వారా అంటే కాంట్రాక్టు పనుల ద్వారా సంపాదిస్తామంటే నిధుల్లేక పనులు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో ఇక పర్సంటేజీలు అనుకున్నంత అందుకునే పరిస్థితి లేదు. దీన్ని దృష్టిలో ఉంచుకుని భూములు, మైనింగుపై అధికారపార్టీ నేతల కన్నుపడింది. రియల్ బూమ్‌తో భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. వీటిని ఏదో రకంగా కైవసం చేసుకుంటే రూ.కోట్ల సంపదను సులభంగా పోగేసుకోవచ్చునన్న ఉద్దేశంతో అధికారపార్టీ నేతలు వీటిపై దృష్టి సారించారన్న ఆరోపణలున్నాయి. కంపెనీల పేరుతో తీసుకున్న భూములను తమ పేర్లపైకి మారిపోతూ ఉండటం గమనార్హం. నేరుగా భూములు కొనాలంటే జిల్లాలో అత్యధికంగావున్నవి అసైన్డు భూములు. వీటి రిజిస్ట్రేషన్లు, సాంకేతిక సమస్యలు ఎదురయ్యే అవకాశాలున్నాయి. అదే పరిశ్రమల పేరుతో అయితే సేకరించడానికి వీలుంటుంది. ఆ పేరుతో సేకరించిన భూములను తాము ఏర్పాటు చేసుకున్న కంపెనీల పేర్లపైకి మార్చేసి వందల ఎకరాల భూములను తమ వశం చేసుకునే పనులు వేగవంతంగా సాగుతున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇప్పటికే నలుగురు ప్రజాప్రతినిధులపై నేరుగానే ఆరోపణలొచ్చాయి. ఇక అసైన్డు కమిటీల ఏర్పాటు చేసి పేదలకు భూములు పంచుతామని ప్రచారమూ జరుగుతోంది. దీంతో ఇప్పటికే జిల్లాలో పెద్దఎత్తున కొండ గుట్టలన్నీ చదునై పోయాయి. వందల ఎకరాల భూములు అసైన్డు కమిటీలో ఇచ్చేందుకు సిద్ధమై ఉన్నాయి. ఇదంతా అధికారపార్టీ నేతల కనుసన్నల్లోనే సాగుతోంది. అప్పుడే ధరలు సైతం నిర్ణయించబడుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇక మైనింగు విషయానికి వస్తే ఇసుక, మట్టి వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగుతోంది. ఇటీవల వర్షాలు అధికంగా పడటంతో వాగులు, నదుల్లోకి సైతం ఇసుక వచ్చిచేరింది. దీంతో ఉన్న ఇసుకను ఎటువంటి అనుమతుల్లేకుండానే యథేచ్ఛగా విక్రయాలను అధికారపార్టీ నేతలు చేపడుతున్నారు. ఉదాహరణకు పెద్దపప్పూరు మండల కేంద్రంలో తహశీల్దారు కార్యాలయం ఎదుటే అనుమతుల్లేకుండానే తవ్వకాలు జరుగుతున్నాయి. అధికారులు మిన్నకుండటం మినహా చేయగలిగిందేమీ ఉండటం లేదు. మట్టి తవ్వకాలు జిల్లా వ్యాప్తంగా అధికారపార్టీ నేతల అండతో సాగుతూనే ఉన్నాయి. వచ్చే ఎన్నికల్లోపు సాధ్యమైనంత వెనకేసుకునే పనిలో భాగంగానే ఇవి జరుగుతున్నాయన్న ఆరోపణలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో సాగు చేసుకుంటున్న పేదలకు అసలైన సాగుదారులకు పట్టాలివ్వాలని సిపిఎం పోరాటాన్ని చేపట్టింది. అదే విధంగా నివాసముంటున్న వారికి ఇళ్ల పట్టాలివ్వాలని డిమాండ్ చేస్తోంది. అనంతపురం జిల్లా పరిధిలో అన్ని ఆర్డీవో కార్యాలయాల ఎదుట ధర్నాలను సైతం నిర్వహించారు. అధికారులకు లబ్ధిదారుల వివరాలను సిపిఎం ఈ వారంలో అందజేసింది. అయితే అసలైన లబ్ధిదారులకు మాత్రం అసలైన లబ్ధి చేకూరడం లేదు. అధికారపార్టీ నేతల పేరు మీద మాత్రం పెద్దఎత్తున భూములు మారిపోతుండం గమనార్హం.

వ్యవసాయానికి జగనన్న కాలనీ బోరు నీరు

వ్యవసాయ అవసరాలకు ఉపయోగిస్తున్న బోరు ఇదే..

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం పట్టణ పరిధిలోని జగనన్న కాలనీలో ఏర్పాటుచేసిన బోరు నీటిని వ్యవసాయ అవసరాలకు ఉపయోగిస్తున్న విషయం వెలుగులోకి వచ్చింది. పట్టణంలోని అడుగుప్ప రోడ్డు వద్ద జగనన్న కాలనీలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన బోరుబావి నీటిని పక్కనే ఉన్న వ్యవసాయ భూమిలో సాగునీటి అవసరాలకు ఉపయోగిస్తున్న విషయం అధికారుల దృష్టికి వచ్చింది. కాలనీలో గృహ నిర్మాణ అవసరాలకు అధికారులు రెండు చోట్ల బోరుబావులను ఏర్పాటు చేశారు. ఆరు చోట్ల నీటి ట్యాంకులను ఏర్పాటు చేసి గృనిర్మాణాలను వేగవంతం చేయాలని లబ్ధిదారులను అధికారులు పురికొల్పారు. కాగా ఈ బోరు బావి పక్కనే ఉన్న వ్యవసాయ పొలం నిర్వాహకులు బహిరంగంగా బోరుబావి నుండి పైపును వారి పొలానికి ఏర్పాటు చేసి అక్కడి నుండి నీటితో పొలం సాగు చేసుకుంటున్నారు. ఈ విషయం అధికారుల దృష్టికి వెళ్లినప్పటికీ పట్టించుకోకపోవడానికి రాజకీయ నాయకుల అండదండలే కారణమని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా నీటి అక్రమ వాడకాన్ని అరికట్టాలని జగనన్న కాలనీ లబ్ధిదారులు కోరుతున్నారు.

దేవాంగుల కులాన్ని కించపరచడం సరికాదు

నందమూరి బాలకృష్ణ దేవాంగులకు క్షమాపణ చెప్పాలి

దేవాంగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డికె.నాగరాజు

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

హిందూపురం ఎమ్మెల్యే, సీనియర్ నటుడు బాలక్రిష్ణ దేవాంగుల కుల నాయకుడు రావణాసురుడు అని అసందర్భ ప్రేలాపన చేయడంతో లక్షలాది మంది దేవాంగుల మనోభావాలు దెబ్బతిన్నాయని, బాలక్రిష్ణ వ్యాఖ్యలను రాష్ట్ర దేవాంగుల సంక్షేమ సంఘం తీవ్రంగా ఖండిస్తోందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డికె నాగరాజు పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నందమూరి బాలక్రిష్ణ ఇటీవల నిర్వహించిన టీవీ డాట్ షోలో దేవాంగుల కులాన్ని కించపరిచే విధంగా మాట్లాడారన్నారు. దేవ బ్రాహ్మణులకు గురువు దేవల మహర్షి అని, వారి నాయకుడు రావణాసురుడు అని చరిత్ర వక్రీకరించి మాట్లాడారన్నారు. అంతేగాకుండా దేవాంగుల కులాన్ని లక లక అని అవహేళనగా మాట్లాడారన్నారు. బాలకృష్ణ తన సినిమా వీరసింహారెడ్డి కథ గురించి చెప్పుకోవాలే రాష్ట్రంలోని లక్షలాది మంది దేవాంగుల మనోభావాలు దెబ్బతినే విధంగా టీవీ షోలో అవగాహన లేకుండా మాట్లాడడం సరికాదన్నారు. భావ స్వేచ్ఛ ఉందని తమ కులాన్ని కించపరిచేలా మాట్లాడితే సహించేది లేదన్నారు. తక్షణమే బాలక్రిష్ణ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని దేవాంగుల సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

చీకటి జీవోలతో జగన్ అరాచక పాలన: కాలవ

ప్రజాశక్తి-రాయదుర్గం

రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చీకటి జీవోలతో అరాచక పాలన సాగిస్తున్నాడని మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు విరుచుకుపడ్డారు. శనివారం ఆయన రాయదుర్గంలోని తన నివాసం వద్ద టిడిపి నాయకులతో కలిసి జీవో నెంబరు1 ప్రతులను భోగి మంటల్లో తగులబెట్టారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సహజంగా భోగి పండుగ రోజున పనికిరాని వస్తువులను మంటల్లో తగలబెట్టడం పరిపాటి అన్నారు. ప్రతిపక్ష పార్టీల సభలు, సమావేశాలు, ర్యాలీలు జరగకుండా రాజకీయ దురుద్దేశంతో జగన్మోహన్‌రెడ్డి తెచ్చిన జీవో 1 ప్రజాస్వామ్యానికి మాయని మచ్చగా నిలుస్తుందన్నారు. ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను వైసీపీ ప్రభుత్వం కాలరాస్తోందన్నారు. హైకోర్టు కూడా జీవో 1ని తాత్కాలికంగా నిలిపివేసిందన్నారు. వైసీపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై హైకోర్టు చాలాసార్లు మొట్టికాయలు వేస్తున్నా జగన్ తీరు మారడంలేదన్నారు. జగన్ రెడ్డి దుష్టపాలనపై రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత ఉందన్నారు. ఇప్పటికైనా జగన్‌రెడ్డి బుద్ధి తెచ్చుకొని చీకటి జీవోను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యం పట్ల ఏమాత్రం గౌరవం లేని ముఖ్యమంత్రి నేతృత్వంలో కొంతమంది పోలీసు అధికారులు ప్రతిపక్ష పార్టీ నాయకులపైన, కార్యక్రమాలపైనా దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారన్నారు. వాళ్లకు కూడా ఈ సంక్రాంతి నుంచి మంచి బుద్ధి కలగాలని కాలవ అభిలషించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నాగరాజు, మండల కన్వీనర్లు హనుమంతరెడ్డి, హనుమంతు, జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తం, రాష్ట్ర మహిళా కార్యనిర్వాహక కార్యదర్శి సంపత్ కుమారి, జిల్లా వాణిజ్య సెల్ అధ్యక్షుడు వెంకటేశులు, నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు మహబూబ్ బాషా, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ శంకర్, మోహన్ రెడ్డి, నాగరాజు, ప్రధాన కార్యదర్శి ఇనాయత్, జిల్లా బిసి సెల్ అధికార ప్రతినిధి సురేంద్ర, ఎంపీటీసీలు గంగాధర్, మల్లికార్జున, ఎస్సీ సెల్ నాయకులు చిన్నికృష్ణ, మల్లీ, సర్పంచ్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం : రాష్ట్రంలో సైకో జగన్ పాలన పోయి ప్రజలకు సుపరిపాలన అందించే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయచౌదరి అన్నారు. శనివారం భోగి పండుగ సందర్భంగా స్థానిక నాయకులతో కలిసి ఎన్‌టిఆర్ భవనం వద్ద జీవో 1 ప్రతులను భోగిమంటల్లో దహనం చేశారు. జగన్ ఓటమి భయం పట్టుకోవడంతోనే రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియకుండా ఉండేందుకే ఇలాంటి జీవోలు తెస్తున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు చౌళం మల్లికార్జున, శివశంకర్, పాపంపల్లి రామాంజినేయులు, కన్వీనర్లు గోళ్ల వెంకటేశులు, సర్మాస్, నాయకులు మారుతీచౌదరి, శ్రీనివాసరెడ్డి, గొర్ల గోవిందరాజులు, రామన్న, గౌని మంజునాథ్‌రెడ్డి, షామీర్, బసవరాజు, సాయి, ఎర్రిస్వామి, సాంబశివ, గోపాల్, శ్రీధర్,తలారీ సత్తి, గరికపాటి హరికృష్ణ, నాగభూషణ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నార్పల : ప్రతిపక్షాలను అడ్డుకునే చీకటి జీవో నెంబరు 1ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఆలం నరసానాయుడు ఆధ్వర్యంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు జీవో ప్రతులను భోగి మంటల్లో వేసి దహనం చేశారు. జీవో 1కు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. సైకో పోవాలి సైకిల్ రావాలి అంటూ నినాదాలు చేశారు. వెంటనే జీవోను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ఎర్రినాగప్ప, మాజీ మండల అధ్యక్షులు పిట్టు రంగారెడ్డి, రాఘవనాయుడు, మాజీ జెడ్పీటీసీ జాఫర్‌వలి, సర్పంచి వెంకటనారాయణమ్మ, తెలుగు యువత చంద్రబాబు, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు పిఎల్ లక్ష్మీనారాయణ, తలారి కుళ్లాయప్ప, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శింగనమల : తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి దేగల కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జీవో ప్రతులను భోగి మంటల్లో శనివారం దహనం చేశారు. జీవోను వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షులు నాగరాజు, శింగనమల పెద్ద నాగముని, గ్రామకమిటీ అధ్యక్షులు బండి వెంకటనారాయణ ముంత వెంకటేష్ బండమీదపల్లి మాజీ ఎంపీటీసీ చిక్కెల్ల, జిల్లా బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి కోయగూర పెద్దన్న, చంద్రాయుడు, జడేజా తదితరులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : స్థానిక ఆర్డీటీ స్కూల్ ఆవరణంలో సిపిఐ మండల కార్యదర్శి చింతా పురుషోత్తం, ఎమ్మార్పీఎస్ మహాజన సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర నాయకులు ఆదినారాయణ, మాజీ సర్పంచి గంగన్న, చేనేత కార్మిక సంఘం నాయకుడు ప్రతాప్ ఆధ్వర్యంలో జీవో 1 ప్రతులను భోగి మంటల్లో దహనం చేశారు. చీకటి జీవోను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

రాయదుర్గంలో జీవో ప్రతులను దహనం చేస్తున్న టిడిపి నాయకులు

పుట్లూరు : టిడిపి జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి సుదర్శన్ నాయుడు ఆధ్వర్యంలో జోవో నెంబర్1 ప్రతులను దహనం చేయడానికి ప్రయత్నించగా నాయకులను పోలీసులు ముందస్తు అరెస్తు చేశారు. ఈ సందర్భంగా సుదర్శన నాయుడు మాట్లాడుతూ.. చీకటి జీవోలు టిడిపి నాయకులు, కార్యకర్తలను అడ్డుకోలేవన్నారు. వెంటనే జీవోను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ముందస్తు అరెస్ట్ అయినవారిలో నాయకులు విజయ్‌కుమార్ నాయుడు, రవిచంద్ర నాయుడు, ఆదినారాయణరెడ్డి, రామాంజనేయులు, సూరి, నరసింహ, భక్తవత్సల, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

సిపిఐ నాయకులు జీవో 1 ప్రతులను దహనం చేయడానికి ప్రయత్నించగా పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో సిపిఐ మండల కార్యదర్శి డి.పెద్దయ్య, మండల మహిళా కార్యదర్శి శాంతకుమారి, డిహెచ్‌పిఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు డి,పెద్దన్న, రమేష్ తదితరులు ఉన్నారు.

గుంతకల్లు : పట్టణంలోని ఎన్టీఆర్ కూడలిలో సిపిఐ నాయకులు వైసిపి ప్రభుత్వం తెచ్చిన జీవో నెం.1 ప్రతులను భోగి మంటల్లో వేసి దహనం చేశారు. ప్రజలు, కార్మికులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆగ్రహానికి గురికాక ముందే జీవోను ప్రభుత్వం ఉపసంహరించు కోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సహాయ కార్యదర్శి మహేష్, మండల కార్యదర్శి రాము రాయల్, పట్టణ సహాయ కార్యదర్శి ఎస్ఎండి.గౌస్, ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి ఈశ్వరయ్య, జిల్లా సమితి సభ్యులు పీసీ కుల్లాయప్ప, రామాంజనమ్మ మురళి, ఎఐఎస్ఎఫ్, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

సంబరంగా బంజారాల రంగవల్లులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని శనివారం బంజారా భవన్‌లో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్, సేవాఘడ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతపురం పట్టణంలోని బంజారా మహిళలు ముగ్గుల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పల్లె వాతావరణం, తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా, వ్యవసాయం, పశువుల ఆకృతులు, ఇల్లు, గుడిసెలు, సేవల్‌భాయా మహారాజ్ చిత్రాలతో ఎంతో చక్కాగా రంగు రంగుల ముగ్గులు వేశారు. ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.బాలాజి నాయక్, పి.బాబు నాయక్ అధ్యక్షతన నిర్వహించిన ముగ్గుల పోటీలను వ్యవసాయ శాఖ అనంతపురం జిల్లా జాయింట్ డైరెక్టర్ చంద్రనాయక్, ప్రముఖ డాక్టర్ బి.రామస్వామినాయక్, బంజారా భవన్ స్థల దాత హరిశౌరి, డాక్టర్ శ్రీనివాస్ శౌరి, ఎబిఎస్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రంగ్లా నాయక్, బాలు నాయక్, ఎస్‌కె.రామచంద్ర నాయక్‌లు ముఖ్య అతిథులుగా హాజరై ముగ్గుల పోటీలు నిర్వహించారు. వీరితో పాటు చంద్రిబాయి, శివమణిబాయి, భనిబాయి, సగుణబాయిలు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించి విజేతలను ఎంపిక చేశారు. మొదటి బహుమతి పావనీ బాయి, రెండవ బహుమతి రూపా, సాయిసుధ తృతీయ బహుమతి అందుకున్నారు. ప్రథమ విజేతకు రూ.2116, ద్వితీయ విజేతకు రూ.1516, తృతీయ విజేతకు రూ.1016 నగదుతో పాటు ప్రశంసాపత్రం, ముత్తుట్ ఫైనాన్స్ కార్పొరేషన్ సంస్థ ప్రతినిధుల తరుపున గిఫ్ట్ హ్యాంపర్స్ అందజేశారు. పోటీల్లో పాల్గొన్న మహిళలకు కన్సోలేషన్ ప్రైజ్ రూ.100 నగదుతో పాటు, ప్రశంసపాత్రం, పోటీలు, కార్యక్రమంలో పాల్గొన్న వారందరికి ఎబిఎస్ఎస్ ప్రమాణపత్రాలు అందజేశారు. అంతకు మునుపు సేవాలాల్ మహారాజ్, జగదాంబ అమ్మవారికి బంజారాలు కొబ్బరి కాయలు కొట్టి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి జెడిఎ చంద్రానాయక్ మాట్లాడుతూ బంజారా కుటుంబాలు కలిసి సంక్రాంతి పండుగ రోజున ముగ్గులు వేస్తూ ఐక్యత చాటడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. డాక్టర్ రామస్వామినాయక్ మాట్లాడుతూ బంజారాలు అందరూ కలుసుకుని పండుగను జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఎబిఎస్ఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాలాజినాయక్, బాబు నాయక్ మాట్లాడుతూ కొండ గుట్టల్లో తండాల్లో నివసిస్తే బంజారాలు ఒకటిగా కలిసి మెలిసి పండుగలు జరుపుకోవడం ఆనవాయితీ అన్నారు. ముగ్గులు వేస్తూ ఎంతో ఆనందం పొందేవారన్నారు. అయితే ఉద్యోగ, జీవనోపాధి కోసం పట్టణాల్లో ఉంటున్న బంజారాలు కలిసి ముగ్గులు వేయాలని తలంపుతో ప్రథమంగా సంక్రాంతికి ముగ్గుల పోటీలు నిర్వహించామన్నారు. ఇలాంటి కార్యక్రమాలు మునుముందు కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన వారందరికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎబిఎస్ఎస్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఎబిఎస్ఎస్ రాష్ట్ర నాయకులు ఎస్‌కె.రామచంద్ర కో ప్రొడ్యూషర్‌గా నిర్మించిన పులి చిత్రం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎబిఎస్ఎస్ జిల్లా సలహాదారులు శేఖర్‌నాయక్, నాయకులు ప్రొఫెసర్ సిఎన్.క్రిష్ణానాయక్, ఠాగూర్ నాయక్, బాపూజీ నాయక్, ఉమాబాయి, శ్రావణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలలో పాల్గొన బంజారా మహిళలు

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలోని బీసీ కాలనీలో శనివారం ఓ యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పెద్దవడుగూరు మండలం గుత్తి అనంతపురం గ్రామానికి చెందిన లాల్ రాజు (30) కారు డ్రైవరుగా ఉంటూ జీవనం కొనసాగించేవాడు. కొంతకాలంగా గుత్తి పట్టణంలోని బీసీ కాలనీలో ఉన్న ఓ ప్రయివేటు పాఠశాల సమీపంలో అద్దె భవనంలో నివాసం ఉండేవాడు. అతడు అనారోగ్యానికి గురయ్యాడు. ఇటీవల గుండె శస్త్ర చికిత్స కూడా చేయించుకున్నాడు. అనారోగ్యానికి గురి కావడంతో పాటు ఆర్థిక సమస్యలతో మనస్థాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో పైకప్పుకు ఉరివేసుకొన్నాడు. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు హుటాహుటిన లాల్ రాజును ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతడు మరణించాడు. మృతుడికి భార్య సునీత, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ఏడుగురు బైండోవర్

ప్రజాశక్తి-పుట్లూరు

సంక్రాంతి పండగ సందర్భంగా పేకాట, కోడి పందేలు ఆడే పాత నేరస్తులు ఏడుగురిని ఎస్ఐ వెంకటప్రసాద్ శనివారం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారు. వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం వారందరినీ తహశీల్దారు ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

గవ్వల పుల్లన్నకు స్వీటు తినిపిస్తున్న మనవళ్లు

104వ పుట్టినరోజు వేడుకలు జరుపుకున్న గవ్వల పుల్లన్న

ప్రజాశక్తి-నార్పల

నార్పల మండలంలోని గవ్వల వీధికి చెందిన గవ్వల పుల్లన్న 104వ పుట్టిన రోజు వేడుకలను ఆయన కుమారుడు గవ్వల సుబ్బయ్య, మనవళ్లు మనవ రాళ్లు వారి స్వగృహంలో శనివారం ఘనంగా నిర్వహించారు. గవ్వల పుల్లన్న మనవళ్లు, మనవరాళ్లు మాట్లాడుతూ తమ తాత 104వ పుట్టిన రోజు వేడుకలను అందరూ కలిసి నిర్వహించడం సంతోషంగా, గర్వంగా ఉందన్నారు. తాతగారు మరిన్ని పుట్టినరోజు వేడుకలను జరుపుకోవాలని ఆకాంక్షించారు. తమ తాత చెప్పిన ఆరోగ్యా సూత్రాలను పాటించి తామూ ఆరోగ్యంగా దీర్ఘాయుష్షు పొందడానికి కృషిచేస్తామని చెప్పారు. పుల్లన్నకు బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు, గ్రామస్తులు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

రహదారి విస్తరణ పనుల పరిశీలన

ప్రజాశక్తి -అనంతపురం

నగరంలో జరుగుతున్న జాతీయ రహదారి విస్తరణ పనులను అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి శనివారం పరిశీలించారు. ఎన్‌హెచ్ అధికారులు, కాంట్రాక్ట్ ప్రతినిధులతో కలిసి పంగల్ రోడ్డు, కలెక్టర్ కార్యాలయం వద్ద, సూర్యనగర్, టవర్‌క్లాక్‌తో పాటు రైల్వే ఓవర్ బ్రిడ్జి, ట్రాక్, నడిమివంక వరకు జరుగుతున్న పనులను చూశారు. టవర్ క్లాక్ సమీపంలో అండర్ పాస్ పరిశీలించారు. రహదారికి ఇరువైపులా జరుగుతున్న డ్రెయిన్ నిర్మాణాన్ని పరిశీలించారు. అనుకున్న సమయం కంటే పనులు వేగంగా జరుగుతుండడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎన్‌హెచ్ అధికారులు, కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులకు సూచించారు. అండర్ పాస్ వద్ద వాహన రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. బ్రిడ్జి వద్ద ఓ వైపు సర్వీస్ రోడ్డు పనులు ప్రారంభించడంతో పాటు మరో వైపు భూ సేకరణ పూర్తి చేసి పనులు మొదలు పెట్టాలని సూచించారు. ప్రజలు కూడా రహదారి విస్తరణ పనులకు సహకరించాలని ఎమ్మెల్యే అనంత కోరారు.

సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో భోగి పండ్ల కార్యక్రమం

ప్రజాశక్తి -అనంతపురం

భోగి పండుగను పురస్కరించుకొని సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో తపోవనం లోని శివశక్తి సాయి దేవాలయంలో శనివారం భోగి పండ్ల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగర డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో దాదాపు 50 మంది పిల్లలు పాల్గొన్నారు. వారందరికీ భోగి పండ్లు పోసి, పిండి వంటలు, బహుమతులు అందజేశారు. సాయి ట్రస్ట్ అధ్యక్షుడు విజయసాయి మాతృమూర్తి రుక్మిణి ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన బాహ్య నేత్రాలకు కనిపించని బ్రహ్మ రంధ్రం మన తల పైభాగంలో ఉంటుందని ఈ భోగి పండ్లను పోయి ఆ బ్రహ్మ రంధ్రాన్ని ప్రేరేపితం చేస్తే పిల్లలు జ్ఞానవంతులు అవుతారని తెలిపారు. రేగు పండ్లు సూర్య కిరణాలలోని ప్రాణశక్తిని అధికంగా గ్రహించి నిల్వవుంచుకుంటాయి కనుక వాటిని తల మీద పోయడం వల్ల వీటిలోని విద్యుత్ శక్తి శరీరంపై, ఆరోగ్యంపై ప్రభావాన్ని చూపించి మంచి ఫలితాలు ఇస్తాయయన్నారు. అందుకే పిల్లలకు భోగి పళ్లు పోసి ఆశీర్వదిస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సాయిట్రస్ట్ అధ్యక్షుడు విజయసాయి కుమార్, ఆలయ ధర్మకర్త శ్రీరాములు, ఆలయ సభ్యులు నాగరాజు, దేవేంద్ర, సాయి ట్రస్టు సభ్యులు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు భోగి పండ్లు పెడుతున్న దృశ్యం